## క్లుప్తంగా

### విద్యార్థినులకు క్రీడా పోటీలు



**బాన్సువాడ రూరల్:** మండలంలోని కొయ్యగుట్టలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వాలంటీర్ సునీల్‌రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### అసైన్డ్ భూములు పేదలకు పంచాలి



**గాంధారి:** అసైన్డ్ భూములను పేదలకు పంచాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సీపీఎం నాయకులతో కలిసి మండలంలోని మాతుసంగెం గ్రామంలోని అసైన్డ్ భూముల్లో నాగలి పట్టి ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, ఎల్లారెడ్డి నియోజక వర్గం కార్యదర్శి మోతిరాం తదితరులు పాల్గొన్నారు.

### డిప్యూటీ కలెక్టర్ల సంఘం డైరీ ఆవిష్కరణ



**కామారెడ్డి క్రైం:** డిప్యూటీ కలెక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కామారెడ్డి అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, ఆర్డీవోలు శ్రీనివాసరెడ్డి, రాజా గౌడ్, శ్రీను నాయక్, ఏవో రవీందర్, ట్రెసా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, జిల్లా అధికారుల సంఘము కార్యదర్శి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

### కూలీలకు పనులు కల్పించాలి



**లింగంపేట:** మండలంలోని ప్రతి పంచాయతీలో 50 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సహాయకులు, సాంకేతిక సహాయకులతో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. నర్సరీల్లో ప్రతి మొక్క ఎదిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### అంబేడ్కర్ జీవిత చరిత్రపై నాటకం

**కామారెడ్డి టౌన్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రపై సోమవారం కామారెడ్డిలోని కళాభారతి ఆడిటోరియంలో నాటకం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని అన్ని వర్గాలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుబాసి నరేందర్, క్యాతం సిద్ధరాములు, జీవీయం విఠల్, సాప శివరాములు తదితరులు పాల్గొన్నారు.

### కనీస వేతనాలు చెల్లించాలి

**బాన్సువాడ టౌన్:** సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు గురువారం ఐసీడీఎస్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు రవీందర్, ఖలీల్ మాట్లాడుతూ అంగన్‌వాడి టీచర్ల సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయం అన్నారు. కనీస వేతనాలు, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు మాధవి, సుక్కమ్మ, గౌరి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

### మహరాజ్‌లకు ఘన స్వాగతం

**పెద్దకొడప్‌గల్:** మండలంలోని పెద్ద దేవిసింగ్ తండాలో గురువారం పంజాబ్ రాష్ట్రం కర్తర్‌పూర్ గ్రామానికి చెందిన డిపేందర్ సింగ్ మహరాజ్, మహరాష్ట్రలోని చంద్రపూర్ నుంచి వచ్చిన గులబ్ సింగ్ మహరాజ్‌లకు తండాకు చెందిన పలువురు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహరాజ్‌లు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.

# బండ బాదుడుపై భగ్గు..

- గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై పెనుభారం
- సబ్సిడీ ఎత్తేసి ధరలు పెంచడం అన్యాయం
- ఆందోళనలు చేపట్టిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

**గ్యాస్ సిలిండర్ ధరలను చమురు సంస్థలు ఒక్కసారిగా పెంచడంతో** బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు భగ్గుమన్నారు. వంటగ్యాస్ ధరలు పెంచి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యులపై పెనుభారం మోపిందని ధ్వజమెత్తారు. గృహోపయోగ సిలిండర్‌పై రూ. 50, వాణిజ్య సిలిండర్‌పై రూ. 350 ధర పెంచిన విషయం తెలిసిందే.



ఎల్లారెడ్డిలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

**ఎల్లారెడ్డి:** వంట గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై కేంద్రం పెనుభారం మోపుతోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ధ్వజమెత్తారు. గురువారం స్థానిక తెలంగాణ తల్లి ప్రాంగణం ఆవరణలో ప్రధాన రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన రోడ్డుపై ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ధర్నా నిర్వహించారు. కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో రూ. 400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర దాదాపు రూ.1,200 చేరిందన్నారు. దీంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు సైతం విపరీతంగా పెంచారని అన్నారు. మూడు రాష్ట్రాల ఎన్నికలు కాగానే రాత్రికి రాత్రి గ్యాస్ ధరలు పెంచారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి, సదాశివనగర్ ఏఎంసీ చైర్మెన్లు నారాయణ, సాయిరెడ్డి, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు కపిల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మెన్ నర్సింలు, కౌన్సిలర్లు పద్మశ్రీకాంత్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

**నిజాంసాగర్(జుక్కల్):** గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల ఇళ్లకు గ్యాస్ మంటలు అంటిస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఆరోపించారు. రానున్నవి అచ్చేదిన్ కాదని బీజేపీ సచ్చే రోజులు వచ్చాయని ధ్వజమెత్తారు. గ్యాస్ ధరల పెంపుపై జుక్కల్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒక వైపు సబ్సిడీ ఎత్తివేసి మరో వైపు గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యుల నెత్తిన బండ వేశారని ధ్వజమెత్తారు. నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, బొల్లి గంగాధర్, నాల్చర్ రాజు, అశోక్ పటేల్, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, గైని విఠల్ తదితరులు పాల్గొన్నారు.

**బాన్సువాడ టౌన్:** సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. ఖాళీ సిలెండర్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల నడ్డి విరుస్తున్న బీజేపీకి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, ఎజాస్, పాత బాలకృష్ణ మోహన్‌నాయక్, గురువినయ్, పాల్గొన్నారు.

**కామారెడ్డి టౌన్:** ధరలు పెంచుతూ ప్రధాని మోదీ పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ ముజీబొద్దీన్ అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నిజాంసాగర్ చౌరస్తాలో కట్టెల పొయ్యిపై వంటా వార్పు కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్యాస్ ధరలు తగ్గించే వరకు పోరాటం చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి మాట్లాడుతూ ధరల పెరుగుదలతో సామాన్యులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, నాయకులు నిట్టు వేణుగోపాల్ రావు, గడ్డం చందు తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్‌లో ఎమ్మెల్యే హన్మంత్‌సింధే..



బాన్సువాడలో అంజిరెడ్డి ఆధ్వర్యంలో..



కామారెడ్డిలో కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తూ..

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**పెద్దకొడప్‌గల్:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వడ్లం సర్పంచ్ తిర్మల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైరమన్ ఖండేరావు పాల్గొన్నారు.

**నిజాంసాగర్:** మండలంలోని మంగ్లూర్‌లో సర్పంచ్ గైని స్వప్న సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దత్తు, నాయకులు ర మేష్, దేవయ్య, సాయిలు పాల్గొన్నారు.

**భిక్కనూరు:** మండలంలోని గుర్జకుంట గ్రామంలో రూ.10 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను సర్పంచ్ మనోహర రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఆత్మకమిటీ చైర్మన్ నర్సింహరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, వైస్ ఎంపీపీ యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బేగంపూర్‌లో పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## అధికారం ఇస్తే సబ్సిడీపై వంట గ్యాస్

**నస్రుల్లాబాద్:** కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే లబ్ధిదారులకు సబ్సిడీపై రూ. 500 గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు. మండలంలోని బొప్పాస్‌పల్లి, లింగంపల్లి, నస్రుల్లాబాద్ గ్రామాల్లో గురువారం హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. బాన్సువాడను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రతాప్ సింగ్, యూసుఫ్ పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు

**సమస్యలపై పోరాడేది కాంగ్రెస్సే**

**నాగిరెడ్డిపేట:** ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కాంగ్రెస్సేనని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ అన్నారు. హాత్ సే హాత్‌లో భాగంగా మండలంలోని చిన్న ఆత్మకూర్, మెల్లకుంట తండా, జప్తిజాన్కంపల్లిలో గురువారం ఆయన గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాలు ప్రజలను ఆదుకోకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కిష్టాఫర్, నాయకులు లక్ష్మణ్, ఇమామ్, సురందర్‌గౌడ్, నవీన్, గులాం, జగన్, సాయిలు, సంగమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



**దోమకొండ:** జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆర్ట్ అండ్ డ్రాయింగ్ పోటీల్లో దోమకొండ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని హెచ్‌ఎం లిలియానా తెలిపారు. ముంబాయిలో నిర్వహించిన పోటీల్లో ఆరు బంగారు, మూడు సిల్వర్ పతకాలు, మూడు ప్రోత్సాహక బహుమతులు సాధించినట్లు వెల్లడించారు. పాఠశాల ఆర్ట్ టీచర్ అబ్రబోయిన నర్సింలు వారి వెంట ఉన్నారు.

### హెచ్‌వోడీకి విద్యార్థుల సన్మానం

**భిక్కనూరు:** తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ జియోఇన్‌ఫర్‌మెటిక్స్ హెచ్‌వోడీగా నియమితులైన డాక్టర్ కవితా తోరస్‌ను ఆ విభాగం విద్యార్థులు గురువారం సన్మానించారు. డాక్టర్ సుధాకర్‌గౌడ్, డాక్టర్ ప్రతిజ్ఞ తదితరులు పాల్గొన్నారు.



### ఆధ్యాత్మికం

**సాయి ఆలయంలో భక్తుల సందడి**

**నస్రుల్లాబాద్:** మండలంలోని నెమ్లి గ్రామంలో ఉన్న శ్రీ షిర్డీ సాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధికి రూ.40 లక్షలు మంజూరు**

**నస్రుల్లాబాద్:** మండలంలోని మైలారం కొచ్చరి మైసమ్మ ఆలయ వద్ద సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరైనట్లు పీఏసీఎస్ చైర్మన్ పెర్క శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన వెంటన ఆలయ కమిటీ సభ్యులు చంద్ర గౌడ్, మేకల రాములు, లింగం గౌడ్, రాజయ్య, బొంబాయి సాయిలు, శ్రీను, బాల హరిచంద్రా రెడ్డి, గంగారాం, మహేందర్ తదితరులు ఉన్నారు.

### కార్యవర్గం ..

**వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీల ఏర్పాటు**

**ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రఖండ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీలను గురువారం ఏర్పాటు చేసినట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట విభాగ్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విభాగ్ కార్యదర్శి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంగారెడ్డి, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

**టీఎస్‌ఎస్‌ఎఫ్ సమన్వయకర్త నియామకం**

**కామారెడ్డి అర్బన్:** టీఎస్‌ఎస్‌ఎఫ్ కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల సమన్వయకర్తగా గాంధారి మండలం జువ్వాడికి చెందిన అంజల్‌రెడ్డిని నియమించినట్లు టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలిపారు.

### స్వయంపాలన దినోత్సవం

**నాగిరెడ్డిపేట:** మండలంలోని తాండూర్ హైస్కూల్‌లో గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతికి చెందిన పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు దిగంబర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## పీఆర్‌సీ అమలు చేయాలి



కామారెడ్డి విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**కామారెడ్డి టౌన్:** తక్షణమే వేతన సవరణ అమలు చేయాలని కోరుతూ గురువారం కామారెడ్డి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ముందు ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. చర్చల పేరుతో కాలయాపన సరికాదన్నారు. కామారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బి. బ్రహ్మం, కో కన్వీనర్ యస్. వెంకటేష్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని విద్యుత్ డీఈ కార్యాలయం ముందు ఆ శాఖ ఉద్యోగులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు బ్రహ్మం, వెంకటేశం, జగదీశ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.



ఎల్లారెడ్డిలో ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

## ఇంగ్లిష్‌పై నైపుణ్యం పెంచుకోవాలి

**కామారెడ్డి అర్బన్:** గ్రామీణ ప్రాంత విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇంగ్లిష్ భాషపై నైపుణ్యం పెంచుకోవాలని బ్రిటన్ విద్యాశాఖ ప్రతినిధి రుచి మిశ్రా విద్యార్థులకు సూచించారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో గురువారం టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో క్విక్ టు లెర్న్- ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ కిష్టయ్య మాట్లాడుతూ కామారెడ్డి కళాశాలను బ్రిటన్ విద్యా శాఖ ఎంపిక చేసుకోవడాన్ని సంతోషం వ్యక్తం చేశారు. వర్క్‌షాప్‌లో టాస్క్ ప్రతినిధి శ్రీనాథ్‌రెడ్డి, టీఎస్‌కేసీ సమన్వయకర్త ఫర్హీన్ ఫాతిమా, అధ్యాపకులు వి.శంకర్, మెంటర్ అజహారోద్దీన్, అఫ్రిన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రిటన్ విద్యాశాఖ ప్రతినిధి

### ముదిరాజ్‌ల్లో ఐక్యత అవసరం

**కామారెడ్డి అర్బన్:** ముదిరాజ్‌లు రాజకీయంగా ఏ రాజకీయ పార్టీలో ఉన్నా ఒకరినొకరు గౌరవించుకుంటూ అవసరమైనప్పుడు కలిసికట్టుగా పని చేసేందుకు ఏకం కావాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బట్టు విఠల్ అన్నారు. రాష్ట్ర ముదిరాజ్ మహాసభ (కాసాని జ్ఞానేశ్వర్) జిల్లా అధ్యక్షుడిగా ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌ను గురువారం బండప్రకాష్ తెలంగాణ ముదిరాజ్ మహాసభకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ఇతర విభాగాల ప్రతినిధులు గోవర్ధన్, ఆర్.చంద్రం, మహేష్, కల్కిచంద్రం, సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

## ఆస్పత్రి నిర్మాణ పనుల ప్రారంభం

**పిట్లం:** రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. గురువారం ఆయన పిట్లంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించడంలో దేశంలోనే రాష్ట్రం మూడవ స్థానంలో ఉందన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శప్థంరెడ్డి, నాయకులు విజయ్, అన్నారం వేంకట్‌రాంరెడ్డి కరీం పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

### బీజేపీ విజయంపై సంబరాలు

**కామారెడ్డి టౌన్:** త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతలు స్థానిక బీజేపీ కార్యాలయం ముందు గురువారం టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకానికి రెఫరెండమే ఈ ఫలితాలు అన్నారు.బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, నరేందర్, నాయకులు సురేష్, వెంకటరెడ్డి, రాజు, ప్రవీణ్, నరసింహ రెడ్డి, రవీందర్, వేణు, రాజేష్, భరత్ పాల్గొన్నారు.



### ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



బాన్సువాడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

**బాన్సువాడ టౌన్/సదాశివనగర్:** బాన్సువాడలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్, వడ్ల శ్రీరాం మాట్లాడుతూ హైదరాబాద్ చైతన్య కళాశాలలో వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న సాత్విక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, మహేష్, సంజు, సాయికిరణ్, రాహుల్ తదితరులు ఉన్నారు.

### న్యాయం కోసం ఆందోళన

**నిజాంసాగర్:** దళిత కుటుంబానికి జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి న్యాయం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడు కాదేపురం గంగారాం డిమాండ్ చేశారు. న్యాయం గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. బూర్గుల్‌కు చెందిన లస్మగల్ల దస్తయ్య పేరిట సర్వే నంబర్ 448లో రెండు ఎకరాల 14 గుంటల భూమి ఉంటే తప్పుడు సర్వేలు చేసి బాధిత కుటుంబానికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ నారాయణ, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలీస్ స్టేషన్ వద్ద దళిత హక్కుల సభ్యులు

## సంక్షిప్తం

**వైద్య విద్యార్థి ప్రీతి మృతికి సంతాపం**

**కామారెడ్డి టౌన్:** వరంగల్‌లో వైద్య విద్యార్థి ప్రీతి మృతి పట్ల స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. ప్రీతి మరణం చాలా బాధాకరం అని అంగన్‌వాడీ టీచర్ సుజాత అన్నారు.

**నట్టల మందు పంపిణీ**

**కామారెడ్డి రూరల్ :** మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గురువారం 3,015 గొర్రె, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు పశువైద్య సిబ్బంది సాయి రెడ్డి, నరేష్, ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ తెలిపారు.

**స్వయం ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం**

**కామారెడ్డి అర్బన్:** దివ్యాంగులు ఉపాధి, పునరావాసం కోసం 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి తెలిపారు.

**స్వయం ఉపాధితో మహిళలకు భరోసా**

**కామారెడ్డి అర్బన్:** మహిళలు స్వయం ఉపాధి కోసం టైలరింగ్ నేర్చుకోవాలని స్థానిక సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెన్ జోసఫ్ కిషోర్ అన్నారు. పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్‌నగర్‌లో ఉన్న అక్షయ సంస్థలో టైలరింగ్ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు.

**కాంగ్రెస్ నేతలపై పోలీసులకు ఫిర్యాదు**

**భిక్కనూరు:** కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల ఆధ్యక్షుడు భీంరెడ్డి, మాజీ సర్పంచ్ సత్యంరెడ్డి సతీమణి శోభాంజలి తనను చంపేందుకు యత్నిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి పోలీసులకు పిర్యాదు చేశారు.

**క్రమశిక్షణతో ముందుకెళ్లాలి**

**బాన్సువాడ టౌన్:** విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకెళ్లాలని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. గురువారం రేణుక వొకేషనల్ కళాశాల ఫేర్‌వెల్ సమావేశం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మహేందర్, డైరెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

**5న గురుకుల ప్రవేశ పరీక్ష**

**మద్నూర్:** మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రవేశాల కోసం 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సవిత తెలిపారు.

**గుండెపోటుతో యువజన కాంగ్రెస్ నాయకుడి మృతి**

**కామారెడ్డి టౌన్:** పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు అహ్మద్ ఉల్లా ఇంతియాజ్ గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**పనుల్లో నాణ్యత పాటించాలి**

**ఎల్లారెడ్డిరూరల్:** బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీపీ మాధవి కాంట్రాక్టర్‌కు సూచించారు. రుద్రారం నుంచి శివానగర్ వరకు వేస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు.

**ఫిజియోథెరపితో సత్ఫలితాలు**

**బాన్సువాడ రూరల్:** దివ్యాంగులకు రోజూ ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం డాక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి చేయించారు.

**బంజారా రథయాత్ర**

**బాన్సువాడ రూరల్:** మండలంలోని కొత్తాబాది, తిర్మలాపూర్, మొగులాన్‌పల్లి, దుంకుడుమోరీతండా, కొయ్యగుట్టల మీదుగా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్ ఆధ్వర్యంలో బంజారా రథయాత్ర కొనసాగింది.